www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 6 అక్టోబర్ 2024
5



వైఎస్ఆర్

వీరబ్రహ్మేంద్ర స్వామి సన్నిధిలో ఏపి సమాచార కమిషనర్



వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకుంటున్న చావలి సునీల్

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం : శ్రీ జగద్గురు మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామిని శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి శిష్యుడైన శ్రీ కక్కయ్య స్వాముల వారిని దర్శించుకున్నారు. వారి వెంట పెద్దిరెడ్డి రామ్, సతీష్ కుమార్ రెడ్డి, చెన్నుపల్లె మల్లారెడ్డి, గుర్రంపాటి రమణారెడ్డి, వద్దమాను నాగేష్ నాయుడు బ్రహ్మంగారిమఠం డిప్యూటీ తహశీల్దార్ జ్యాన్సన్, సర్వేయర్ డిప్యూటీ తాహశీల్దార్ సాంబశివారెడ్డి, టౌన్ వీఆర్ఓ వినయ్, మఠం పోలీసులు ఏఎస్ఐ గుర్రప్ప, నాగేష్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

కడపలో దాహం కేకలు!

- వాటర్‌గండిలో పైప్‌లైన్ లీకేజీ
- ఇప్పట్లో తాగునీటి సమస్య తొలగేలా లేదు
- ప్రత్యామ్నాయంపై కార్పొరేషన్ దృష్టి

కడపలో దాహం కేకలు మిన్నంటాయి. నగరానికి సమీపంలోని పెన్నానది పరిధిలోని వాటర్‌గండి పైప్‌లైన్‌కు లీకేజీలు ఏర్పడడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. ఐదు రోజులుగా ప్రధాన ప్రాంతాలకు తాగునీటి సరఫరా స్తంభించిపోయింది. పట్టణ ప్రజానీకం తాగునీటి కోసం సమీపంలోని కార్పొరేషన్ కుళాయిలు, తాగునీటి సరఫరా ప్రాంతాలకు బిందెలు, పాత్రలు తీసుకుని పరుగులు తీస్తున్న దృశ్యాలు కొల్లలు. కార్పొరేషన్ అధికార యంత్రాంగం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో తలమునకలు కావడం గమనార్హం.



ట్యాంకర్ల ద్వారా నీటిని పట్టుకుంటున్న ప్రజలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడపలో తాగునీటి ఎద్దడి తీవ్రమవుతోంది. కార్పొరేషన్ పరిధిలో సుమారు నాలుగు లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. సుమారు సగం నివాస ప్రాంతాలకు నీటి కొరత ఏర్పడింది. నగరానికి సుమారు ఐదు కిలోమీటర్ల సమీపంలోని పెన్నానదీ పరీవాహక ప్రాంతంలో ఏర్పాటు చేసిన వాటర్ గండి నుంచి పైప్‌లైన్‌ల ద్వారా నగరానికి నీటిని సరఫరా చేస్తున్న సంగతి తెలిసిందే. ఐదు రోజుల కిందట నగరానికి తాగునీటిని సరఫరా పైప్‌లైన్లు లీకేజీ కావడంతో సమస్య తలెత్తింది. ఫలితంగా హార్ట్ ఆఫ్ ది టౌన్‌గా పరిగణ పొందిన ద్వారకానగర్, నాగరాజుపేట, రాజారెడ్డివీధి, సెవెన్‌రోడ్స్, బోరెడ్డివీధి, నిరంజన్‌నగర్, మరియాపురం తదితర ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. సహజంగానే మూడు రోజులకు ఒక సారి తాగునీటి సరఫరా చేయడం పరిపాటి. వాటర్‌గండి పైప్‌లైన్ల లీకేజీ ఏర్పడిన నేపథ్యంలో ఎన్ని రోజులకు నీరు అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

ప్రత్యామ్నాయాల అన్వేషణలో కమిషనర్

వాటర్‌గండి పైప్‌లైన్ల లీకేజీ నేపథ్యంలో కమిషనర్ సీరియస్‌గా స్పందించారు. లీకేజీ సమస్యల్ని ఎలా పరిష్కరించాలో ఆలోచించాలని నిపుణులను పురమాయించారు. నదీ ప్రవాహం ఉధృతంగా సాగుతుండడంతో ముందడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. ఆయనతోపాటు ప్రజాప్రతినిధులు వాటర్‌గండి లీకేజీని అరికట్టడంపై దృష్టి సారించారు. నీటి కొరత ఏర్పడిన ప్రాంతాలకు ఇతర ప్రాంతాల పైప్‌లైన్లను మళ్లించే ప్రయత్నాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. 10 వాటర్ ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు.



వాటర్ గండి పైప్‌లైన్ లీకేజీపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే మాధవి (ఫైల్‌ఫోటో)

లీకేజీలపై మల్లగుల్లాలు

ఒకవైపు పెన్నానదీ ప్రవాహం...మరోవైపు వాటర్‌గండి పైప్‌లైన్ల లీకేజీ ఏమిటో తెలియడం లేదు. ఎన్ని పైప్‌లైన్లు ఎక్కడెక్కడ లీకేజీ బారిన పడ్డాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది. నీటి సరఫరా వ్యవస్థకు మరమ్మతులు ఎలా చేయాలి, తాగునీటి కొరత ఎదుర్కొంటున్న ప్రాంతాలకు నీటిని ఎలా సరఫరా చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. కమిషనర్ చురుకుగా స్పందించినప్పటికీ ప్రకృతికి సంబంధించిన, సాంకేతిక సమస్య కావడంతో ఎప్పుడు, ఎలా పరిష్కరించాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది.

లీకేజీ అరికట్టేందుకు చర్యలు

వాటర్‌గండి పైప్‌లైన్ల లీకేజీని అరికట్టడంపై దృష్టి సారించాం. సాంకేతిక, ప్రకృతికి సంబంధించిన సమస్య కావడంతో ఎలా చేయాలనే అంశంపై ఆలోచిస్తున్నాం. నదీ ప్రవాహం ఉధృతంగా సాగుతుండడంతో లీకేజీలను గుర్తించి అరికట్టే ప్రయత్నంలో నిమగ్నమయ్యాం.

- నందన్, కార్పొరేషన్ కమిషనర్, కడప.

సకాలంలో తాగునీటిని అందించండి



కడప నగరంలో నీటి కొరత రోజురోజుకూ తీవ్రమవుతోంది. గతంలో రెండు, మూడ్రోజులకు ఒకసారి నీటిని సరఫరా అయ్యేది. ప్రస్తుతం ఐదారు రోజులకు ఒకసారి కూడా తాగునీరు అందడం లేదు.

- విమలమ్మ, నిరంజన్‌నగర్, కడప.

సత్వరమే తాగునీటి సరఫరా చేయండి



సత్వరమే తాగునీటిని సరఫరా చేసి ఆదుకోండి. ఐదారు రోజులుగా నీటి కొరత ఏర్పడిన కారణంగా తీవ్ర ఇబ్బందుల పడుతున్నాం. జిల్లా అధికార యంత్రాంగం సత్వరమే స్పందించాలి.

- ఆలూరి జోజప్ప, మరియాపురం, కడప

నవంబర్‌లో పెద్దదర్గా ఉత్సవాలు

- 3 నుంచి 21 వరకు నిర్వహణ
- అందరూ పాల్గొని విజయవంతం చేయాలి
- కలెక్టర్ శివశంకర్ లోతేటి



సమావేశంలో మాట్లాడుతున్న శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి - కడప అర్బన్

నవంబర్ నెల 3 నుంచి 21 వరకు నిర్వహించబోయే 'అమీన్ పీర్ దర్గా' ఉరుసు ఉత్సవాలను కులమతాలకు అతీతంగా, మతసామరస్యంతో కలిసికట్టుగా నిర్వహించాలని కలెక్టర్ శివశంకర్ పిలుపునిచ్చారు. శనివారం అమీన్ పీర్ దర్గా లోని ముషాయిరా హాల్‌లో ఉరుసు ఉత్సవాల ఏర్పాట్లపై అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి జనాబ్ ఆరిఫ్ ఉల్లా హుసేని అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన కడపలో మన పండుగగా భావించే కడప అమీన్ పీర్ దర్గా ఉత్సవాలను అందరూ కలసి కట్టుగా పనిచేసి విజయవంతం చేయాలని అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరారు. ఉరుసు మహోత్సవానికి లక్షలాది మంది యాత్రికులు వస్తారని వారికి ఎటువంటి లోటుపాట్లు లేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేయాలని పేర్కొన్నారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పరిశుభ్రత ఏర్పాట్లను చూడాలని, పురుషులకు, స్త్రీలకు వేరువేరుగా మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, సురక్షితమైన తాగునీటి పాటుతో హై మాస్ లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్తు అంతరాయం లేకుండా విద్యుత్తు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అధిక సంఖ్యలో వైద్య సిబ్బందిని వైద్యాధికారులను నియమించి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో అమీన్ పీర్ దర్గా ఉత్సవాలను ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్య మాట్లాడుతూ శతాబ్దాల నాటి చరిత్ర కలిగిన ప్రఖ్యాత అమీన్ పీర్ దర్గా ఉత్సవాలను మత సామరస్యాన్ని ప్రతిబింబించేలా ఉత్సవాలను అందరూ కలసి కట్టుగా పనిచేసి విజయవంతం చేయాలన్నారు. కడప శాసన సభ్యురాలు ఆర్. మాధవి మాట్లాడుతూ అమీర్ పీర్ దర్గా ఉరుసు మహోత్సవాలను గతంలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. పోలీస్ శాఖ అన్ని కోణాలలో భద్రత ఏర్పాట్లను చేయాలని అన్నారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అధికారులు ఉరుసు మహోత్సవాన్ని నిర్వహించాలన్నారు. అనంతరం ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు ఉరుసు మహోత్సవ బ్యానర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెసి అదితి సింగ్, డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్, ఆర్‌డిఒ జాన్ ఎర్విన్, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ రాకేష్, నగర కార్పొరేటర్లు, ఉరుసు ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల జిల్లా. టిడిపి పొలిట్ బ్యూరో శ్రీనివాసులు రెడ్డి, నాయకులు అమీర్ బాబు, అఫ్జల్ ఖాన్, గోవర్ధన్ రెడ్డి, హరి ప్రసాద్, సుబాహాన్ బాషా, నజీర్ మహమ్మద్, మసీమా బాబు, లక్ష్మీ రెడ్డి, సుంకర శ్రీనివాస్, జిలాని బాషా, అధికారులు పీఠాధిపతుల శిష్య బృందం పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల నిరసన

ప్రజాశక్తి - సిద్ధవటం : సిద్ధవటం మండలం మాధవరం-1 గ్రామపంచాయతీ రామ కృష్ణాపురంలో కొన్ని రోజులుగా మంచినీళ్లు రావడం లేదని మహిళలు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఇటు అధికారులు, అటు ప్రజా ప్రతినిధులు నీటి సమస్య పరిష్కారం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ అధికారులు పరిష్కారం చూపుతామని కాలయాపన చేస్తున్నారే తప్ప పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. తాగునీటి కోసం పనులు కూడా మానుకుంటున్నామని తెలిపారు. పొలాలకు వెళ్లి పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే నీటి సమస్యకు పరిష్కారం చూపాలని మహిళలు విజ్ఞప్తి చేశారు.

రిజిస్ట్రార్ రాంప్రసాద్‌రెడ్డిని తొలగించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : లైంగిక ఆరోపణలు కలిగిన కీచక వైవీయూ రిజిస్ట్రార్ రాంప్రసాద్ రెడ్డిని ఉద్యోగ బాధ్యల నుంచి తొలగించాలని డివైఎఫ్ఐ నాయకులు కడప ఎమ్మెల్యే మాధవిని, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస రెడ్డిని కోరారు. శనివారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో వారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. ఉన్నత విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువు స్థానంలో ఉండి ఆ పదవికే కళంకితం తెచ్చి మహిళల్ని వేధించిన లైంగిక ఆరోపణ కలిగిన వ్యక్తి రాంప్రసాద్ రెడ్డి యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ గా నియమితులవడం దారుణమైన విషయమన్నారు. 2011లో తెలుగు శాఖ డిపార్ట్‌మెంట్‌లో తన పిహెచ్‌డి స్కాలర్లను, మహిళలను వేధింపులు గురి చేశారని ఆరోపణలతో యూనివర్సిటీ కమిటీ వేశారని, ఆ కమిటీ నిజమేనని నిర్ధారించిందని పేర్కొన్నారు. అందుకుగాను యూనివర్సిటీ కమిటీ క్రమశిక్షణ చర్యలు తీసుకుందన్నారు. ఇటువంటి వారి దగ్గర మహిళలు, విద్యార్థులు ఏవిధమైన రక్షణ లో చదువు అభ్యసిస్తారన్నారు. ఎమ్మెల్యే మాధవి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అందరికీ న్యాయం జరిగే విధంగా చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర కన్వీనర్ విజయ్, నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన కర్నూలు, చిత్తూరు మ్యాచ్

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎసిఎ అండర్- 14 ప్లేట్ గ్రూప్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో కర్నూలు, చిత్తూరు జట్ల మధ్య నిర్వహించిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 85 పరుగులు. ఐదు వికెట్ల నష్టానికి 87 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు రోజు బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 76.0 ఓవర్లలో 202 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని ఆశీస్సు రెడ్డి 41 (నాట్ అవుట్) శ్రీవంత్ రెడ్డి 33 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని గిరి దారి మూడు, వివేక్ మూడు, అంకిత్ పరీక్ మూడు వికెట్లు తీసుకున్నారు. మ్యాచ్ డ్రాగా ముగిసింది.

ఆదర్శ ఉపాధ్యాయులకు అవార్డులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రతి సంవత్సరమూ రబ్బీవుల్ అవ్వల్ మాసాన్ని పురస్కరించుకుని ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్(ఐటా) కడప శాఖ ఆదర్శ ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఐడియల్ టీచర్ అవార్డుతో సన్మానిస్తుంది. ఈ సంవత్సరం 13 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. బెల్లంమండి వీధిలోని మదరస జేహరాలోని కాన్ఫరెన్స్ హాల్లో ఐడియల్ టీచర్ అవార్డులు ప్రదానం చేశారు. ఇంటర్మీడియట్ నుంచి పీజీ విద్యార్థులకు మొహమ్మద్ ప్రవక్త (స.అ.స) జీవిత చరిత్రపై తెలుగు, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన 17 మంది విద్యార్థులకు మెమొంటోలు, పాల్గొన్న ప్రతి విద్యార్థినీ విద్యార్థికి సర్టిఫికెట్లు అందజేశారు. ముజాహిద్ ఖాన్ ఉమ్రి మాట్లా డుతూ అన్ని విషయాలలో ఆదరణవంతంగా ఉన్నప్పుడే ప్రతి ఉపాధ్యాయుడు ఆదర్శ ఉపాధ్యా యులవుతారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ షాజియా బేగం, ఐటా రాష్ట్ర అధ్యక్షులు ఎస్.అబ్దుల్ రజాక్, జాతీయ కార్యదర్శి ఎస్.షాకీర్ హుస్సేన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.నజీర్ బా, ఎస్.అబ్బాస్ అలీ, దాదాపు 200 మంది ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగరాన్ని శుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరాన్ని శుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం అన్నారు. శనివారం నాగరాజుపేట, పాత బస్టాండ్, సన్‌రైజ్ ఆస్పత్రి ప్రాంతాలను పారిశుధ్య విభాగ అధికారులతో కలిసి పరిశీలించారు. నాగరాజు పేట ప్రాంతంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తూ అక్కడి కార్మికులతో మాట్లాడారు. రోజూ వారికి కేటాయించిన ప్రాంతంలో ఎప్పటికప్పుడూ శుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికుల హాజరు పట్టికలను పరిశీలించారు. కార్మికులు యూనిఫాం తప్పనిసరిగా ధరించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా శానిటేషన్ విభాగా అధికారులను ఆదేశించారు. మెయిన్‌రోడ్‌లో ఉదయాన్నే శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. పాత బస్టాండ్‌లో రద్దీ లేని సమయాన రోడ్లను శుభ్రం చేసే ప్రక్రియను చేయాలని అక్కడి పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణ రోజూ చేస్తున్నారా లేదా అనే విషయంపై ప్రజలతో ఆరా తీశారు. చెత్త సేకరణలో ఎటువంటి నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని పేర్కొన్నారు.

కాశిరెడ్డి నాయన విగ్రహం ప్రతిష్టాపన

ప్రజాశక్తి-కలసపాడు

దసరా ఉత్సవాలలో భాగంగా మండలంలోని ముద్దంవారిపల్లె, కనికెల గుండాల వద్ద కాశిరెడ్డి నాయన విగ్రహాన్ని, శివలాంగాన్ని పూజారి ఓబయ్య ప్రతిష్టాపన చేశారు. దసరా సందర్భంగా మూడో రోజు శనివారం అన్న దానం ఏర్పాటు చేశారు. చెన్నారెడ్డిపల్లె కోలాట కమిటీ గురువు ప్రసాదరావు ఆధ్వర్యంలో కోలాటం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రవణమ్మ, సూరా రామ సుబ్బారెడ్డి, పి. రామసుబ్బయ్య, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మెయిన్ పరీక్షలు నిర్వహించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - బద్వేలు : పోలీస్ కానిస్టేబుల్ నోటిఫికేషన్ 2022 నవంబర్ 28న 6100 ఉద్యోగాలకు విడుదల చేశారని, క్వాలిఫై అయినా అభ్యర్థులకు వెంటనే హోమ్‌గార్డుల రిజర్వేషన్ కేసును పూర్తిచేసి ఫిజికల్ ఈవెంట్స్, మైన్స్ ఎగ్జామ్ నిర్వహించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని స్థానిక సుందరయ్య భవనంలో డివైఎఫ్ఐ పట్టణ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపి పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు ఎపిఎస్‌పిలో 8 నుంచి 15 శాతం, సివిల్ 15 నుంచి 25 శాతం పెంచడం వల్ల ఆ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పోలీస్ బోర్డు హైకోర్టుకు వెళ్ళిందని, అక్కడినుండి ప్రస్తుతం సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉందని, గత ప్రభుత్వం కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కానీ కేస్ పైన ఒక్క హియరింగ్‌కి కూడా హాజరవ్వకుండా అభ్యర్థులకు, హోంగార్డుల మధ్య తగాదాగా మార్చి కాలయాపన చేసిందని పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం 100 రోజుల్లో ఈ ప్రక్రియని పూర్తి చేస్తామని తెలిపారు. సమావేశంలో బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కె.మస్తాన్, షరీఫ్, ఆదిల్, ఉపాధ్యక్షులు యువరాజ్ షబ్బీర్, సహాయ కార్యదర్శి ఎస్.కె ఖలీల్ పాల్గొన్నారు.

మహిళలకు చట్టాల పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

మహిళలు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రెటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. 'విధాన్ సే సమాధాన్ జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో శనివారం చింతకొమ్మదిన్నె ఎంపిడిఒ కార్యాలయ సమావేశ హాలులో మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బ్లాక్ స్థాయిలో మహిళలకు మహిళ చట్టాల పట్ల అవగాహన కల్గిస్తున్నామని చెప్పారు. ఇలాంటి అవకాశాన్ని ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. కుటుంబంలో మహిళ పాత్ర ప్రత్యేకమైందని చెప్పారు. కావున మహిళలు ఇలాంటి ప్రత్యేక కార్యక్రమాలకు హాజరై చట్టాల పట్ల అవగాహన పొందవచ్చు అని తెలిపారు. రీసోర్స్ పర్సన్ న్యాయవా హసీనా మాట్లాడుతూ గృహహింస, వరకట్న, లైఇంగిక వేధింపులు, మహిళల పట్ల క్రూరత్వం, యాసిడ్ దాడి, అత్యాచారం, గ్యాంగ్ రేప్ వంటి వాటికి పరిష్కారమార్గాలు వివరించారు. న్యాయవాది శ్రీదేవి ఉచిత న్యాయ సాయం, నల్సా లీగల్ ఎయిడ్ హెల్ప్ లైన్ నంబర్ 15100 అంశాలను వివరించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు న్యాయవాదులు, ఇఒపిఆర్‌డి శ్రీధర్, సిఐ శంకర్ నాయక్, పారా లీగల్ వాలంటీర్లు, మహిళలు పాల్గొన్నారు.

చెన్నూరు: స్థానిక ఎంపిడిఒ సభా భవనంలో విధాన్ సే సమాధాన్ జాతీయ మహిళ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బ్లాక్ స్థాయిలో మహిళలకు జిల్లా న్యాయాధికార సంస్థ చైర్ పర్సన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి సూచ నల మేరకు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ బ్లాక్ స్థాయిలో మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లాక్ స్థాయిలో మహిళలకు మహిళ చట్టాల పట్ల అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాది హిమజా, వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ అశ్విని, సిఐ పురుషోత్తమ రాజు, ఎంపిడిఒ అడ్మినిస్ట్రేటర్ గంగాదేవి, పారా లీగల్ వాలంటరీలు, మహిళలు పాల్గొన్నారు.

పోరుబాట

ప్రజాదృష్టి

జిల్లాలో ఉద్యమాల వేడి రగుల్కొంది. ఒకవైపు సిఐటియు నాలుగో తరగతి ఉద్యోగుల తరుపున కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తోంది. మరోవైపు వైవీయూ కేంద్రంగా తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ల నియామకాల్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి సంఘాలు సమరశంఖాన్ని పూరించాయి. అంగన్వాడీలపై వేధింపులు, మున్సిపల్, ఆప్కాస్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఉద్యమిస్తోంది. సోమవారం కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఆప్కాస్, మున్సిపల్ ఉద్యోగులు ఆందోళనలు చేపట్టడం అందరి దృష్టినీ ఆకర్షించింది. సిఐటియు చిరుద్యోగుల హక్కుల గొంతుకగా దశాబ్దాలుగా పోరాడుతోంది. కింది స్థాయి ఉద్యోగుల తరుపున గళాన్ని వినిపిస్తోంది. నిరంతర పోరాటాల ద్వారా కార్మికులు హక్కులను కాపాడుతోంది. టిడిపి అధ్యక్షులు చంద్రబాబు ప్రతిపక్షంలో ఉండగా అంగన్వాడీలు, ఆశాల సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో కార్మికులు చేపట్టిన ఆందోళనలకు టిడిపి తరుపున సీనియర్ నాయకులు హాజరై సంఘీభావాన్ని ప్రకటించారు. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి నాయకత్వం అంగన్వాడీలు, ఆశాలు, మున్సిపల్ కార్మికులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రహించాలి. ఇదిలాఉండగా యోగి వేమన యూనివర్శిటీలో పోరాటం పట్టాలెక్కింది. ఇటీవల పొరుగు దేశమైన బంగాదేశ్‌లోని ఓ యూనివర్శిటీలో తలెత్తిన విద్యార్థుల ఉద్యమం కారణంగా అక్కడి ప్రభుత్వమే కూలిపోయిన సంగతి తెలిసిందే. ఇటువంటి ప్రపంచ అనుభవాల స్ఫూర్తిని విద్యార్థి సంఘాలు ఆదర్శంగా తీసుకుని పోరాటం చేసి హక్కులను సాధించుకోవాలి. వైవీయూలో విసి, రిజిస్ట్రార్ల నియామకాల్ని వ్యతిరేకిస్తూ కొన్ని నెలలుగా విద్యార్థి సంఘాలు ఆందోళన చేస్తుండడం తెలిసిందే. రాష్ట్రంలోని పాలకుల్లో ఎటువంటి మార్పు కనిపించడం లేదు. ఇటీవల నియమితులైన వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్లపై వచ్చిన తీవ్ర ఆరోపణల నేపథ్యంలో వాస్తవాలను విచారించిన అనంతరం ముందుకెళ్లాలి. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న అధ్యాపకులను నియమిస్తే విద్యార్థినుల భవిష్యత్ ఆందోళనల్ని తొలగించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ఉత్తమ అధ్యాపక నాయకత్వాలను యూనివర్శిటీలకు అందించాల్సి ఉంది. వైసిపి సర్కారు హయాం నుంచి కొనసాగుతున్న ఉల్లంఘనల పరంపరను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటు వంటి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కళంకితుల స్థానంలో ఉత్తమ నాయకత్వాలను అందించాలని కోరుతూ విద్యార్థి సంఘాలు రాష్ట్ర సచివులను కలిసి వినతిపత్రాలను అందజేయడం వరకు పరిస్థితి వెళ్లడం విస్మయాన్ని కలిగిస్తోంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడపలో లలితా జ్యువెలర్స్ 56వ షోరూం ఏర్పాటు

ఎమ్మెల్యే మాధవి, ఎమ్‌డి కిరణ్‌కుమార్‌చే ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి, ఎమ్‌డి కిరణ్‌కుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగు రాష్ట్రాల్లో ఆదరణ పొందిన లలితా జ్యువెలర్స్ వారి 56వ షోరూం కడప కోటి రెడ్డి సర్కిల్ వద్ద ఏర్పాటు చేశారు. శనివారం ఎమ్మెల్యే మాధవి, సంస్థ చైర్మన్ డాక్టర్ ఎం.కిరణ్ కుమార్, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి షో రూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 100 షోరూమ్‌లకు లలితా జ్యువెలర్స్ చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రజా ఆదరణ ఎక్కువగా ఉందని తెలిపారు. దసరా పండుగ ఆఫర్ ఇవ్వడం వల్ల షోరూంలో కొనుగోలుదారుల తాకిడి అధికంగా ఉందని చెప్పారు. అన్ని రకాల జ్యువెలర్స్, డైమండ్స్, వెండి అందుబాటులో ఉండడం అభినందనీయమని పేర్కొన్నారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వడం కూటమి లక్ష్యమని చెప్పారు. దానిని లలితా జ్యువెలర్స్ ఆచరించి చూపడం హర్షణీయమని తెలిపారు. వ్యాపారులకు అనుకూల పరిస్థితులను కల్పిస్తామని హామీ ఇచ్చారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పెద్ద ఆభరణాల సంస్థ కడపకు రావడం గర్వకారణమన్నారు. పెద్ద సంస్థలు వస్తే ఉపాధి వ్యాపార అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. అభివృద్ధి కూడా చెందుతుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతో పెద్ద పెట్టుబడులు పడుతున్నారని చెప్పారు. చైర్మన్, ఎండి డాక్టర్ ఎం.కిరణ్ కుమార్ మాట్లాడుతూ 40 సంవత్సరాలకు పైగా సేవలందిస్తూ దక్షిణ భారత దేశంలో అగ్రగామిగా గుర్తింపు తెచ్చుకున్న లలితా జ్యువెలరీ తన 56వ షో రూమ్ కడపలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. తయారీ ధరకే బంగారు, వజ్రాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. దీనివల్ల ప్రజలు పెద్ద మొత్తంలో తమ కష్టార్జితాన్ని ఆదా చేయవచ్చని చెప్పారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఇతర షో రూమ్‌లలో లభించని సరికొత్త బంగారు నగల కొనుగోలు పథకం కూడా అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా బంగారు నగలపై జరుగులో ఒక శాతం తగ్గింపు ఇస్తున్నామని తెలిపారు. వజ్రాలపై క్యారెట్‌కు రూ.5వేలు తగ్గింపు ఆఫర్ ఈనెల 13 వరకు మాత్రమే ఉంటుందని చెప్పారు. సరికొత్త నగల కొనుగోలు పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగల రంగంలో ఉచితాలు బహుమతులు డిస్కౌంట్ల పేర్లతో వినియోగదారులను తికమక చేస్తూ ఉంటారని పేర్కొన్నారు. ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బు విలువ తనకు బాగా తెలుసని, 'డబ్బులు ఎవరికీ ఊరికే రావు' అని, అందుకే కస్టమర్లకు తానే అవగాహన కల్పిస్తూ ఉంటానని ఎమ్‌డి చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి కార్పొరేటర్ ఎం.వి.శ్రీదేవి, పలువురు నాయకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని మతాలను సమానంగా చూడాలి

ప్రజాశక్తి - కడప : కాంగ్రెస్ పార్టీ తోనే లౌకిక ప్రజాస్వామ్యానికి మనుగడ అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్. డి. విజయ జ్యోతి అన్నారు. అన్ని మతాలను సమానంగా చూడాలని చెప్పారు. శనివారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు అయ్యేలా పనిచేయాలని చెప్పారు. ప్రజల కోరికలు నెరవేర్చాలని ఆ దిశగా ముందుకు వెళ్లాలని ప్రభుత్వాన్ని కోరారు. కడప జిల్లాలోని కొప్పర్తి రెండవ దశ రూ.250 కోట్ల విలువైన ప్రాజెక్టును అమరావతి రాజధాని సిఆర్‌డిఎలో నెలకొల్పడం దారుణం అన్నారు. ఎం ఎస్‌ఎంఇ సంస్థ రెండవ దశ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాటు, నిరుద్యోగ యువతకు ఉపాధి లభించి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అలాంటి సంస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జగన్మోహన్ రెడ్డిపై కక్ష సాధింపుతో సిఆర్‌డిఎకు తరలిస్తూ జీవో నెంబర్ 56 ను తీసుకురావడం అన్యాయమన్నారు. సమావేశంలో పిసిసి మాజీ ఉపాధ్యక్షులు బండి జకరయ్య, మాజీ పిసిసి కార్యదర్శి సిరాజుద్దీన్, మైనుద్దీన్ పాల్గొన్నారు.

పనిదినాల కోసం ఎంఇఒకు వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్ : 2024-2025 విద్యా సంవత్సరానికి 220 పని దినాలు కలిగి ఉండడానికి అనుమతి కోరుతూ 'మీమా' తరుపున ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీ సభ్యులు శనివారం ఎంఇఒకు వినతి పత్రం అందజేశారు. తమ పాఠశాలలో చదివే విద్యార్థులు దాదాపు 95 శాతం ఉన్నారని చెప్పారు. దసరా, సంక్రాంతికి ఇచ్చే సెలవులను తాము తమ పండగలైన రంజాన్, క్రిస్మస్ రోజుల్లో ఆ సెలవులను ఉపయోగించుకొనుటకు అనుమతి ఇవ్వాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ హై స్కూల్, న్యూ పీస్ ఇస్లామిక్ స్కూల్ డైరెక్టర్ సయ్యద్ గౌస్ పీర్, అస్సాలిహాద్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, బిలాల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్లు, ఇతర సిబ్బంది ఉన్నారు. ఎంఇఒ సానుకూలంగా స్పందించారు.

శిల్పారామంలో దసరా ఉత్సవాలు



మాట్లాడుతున్న శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్ : దసరా ఉత్సవాలను పురస్కరించుకొని శిల్పారామంలో నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని శిల్పారామం ఎఒ శివప్రసాద్ రెడ్డి కోరారు. శనివారం స్టేట్ గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 6,11,12,13 తేదీలలో ప్రముఖ డాన్స్ మాస్టర్ చే, టీవీ యాంకర్లచే గొప్ప ప్రదర్శన నిర్వహిస్తున్నామని తెలిపారు. శిల్పారామం కళావేదికపై సాయంత్రం 5:30 నుంచి రాత్రి 8 గంటలకు కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఆదివారం ఉదయం 10 నుంచి రాత్రి 8:30 వరకు శిల్పారం తెరిచి ఉంటుందని పేర్కొన్నారు. పిల్లలు, పెద్దలు ఆనందించడానికి అన్ని సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి ఆదివారమూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్నాయని చెప్పారు. శిల్పారామం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ.ఎ.ఎల్. పద్మావతి, కలెక్టర్ శివ శంకర్ సహకారంతో దసరా ఉత్సవాల నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

జనహితమే వైసిపి అభిమతం

ప్రజాశక్తి - కడప : జనహితమే వైసిపి అభిమతం అని, మానవత్వమే జగనన్న మతం అని వైసిపి కమలాపురం ఇన్‌ఛార్జి పి. నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. శనివారం కడప జిల్లా వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారాన్ని తీసుకొచ్చారు అని అన్నారు. ప్రాయచిత్తం అంటే ఏమిటో పవన్ కల్యాణ్ చెప్పాలన్నారు. నిర్ధారణ లేకుండానే కల్తీ మాటలు మాట్లాడితే సుప్రీం కోర్టు వారికి మొట్టికాయలు వేసింది అని చెప్పారు. పవన్ కల్యాణ్ ఒక సారి క్రిస్టియన్ ,నాస్తికుడునీ అంటారని, ఈయన సనాతన ధర్మాన్ని కాపాడుతాడా అని ప్రశ్నించారు. సనాతన ధర్మం పేరు చెప్పి మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని విమర్శించారు.



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

విద్యార్థులు గొప్పగా ఎదగాలి

- వైవీయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఉన్నత విద్యా ప్రమాణాలు గుర్తించుకుని విద్యార్థులు భవిష్యత్‌లో గొప్పగా ఎదగాలని వైవీయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి సూచించారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆచార్య కె.కృష్ణారెడ్డి, ఒంటేరు శ్రీనివాసులురెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఒంటేరు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో ఉన్న ప్రతి ఒక్కరికి గురువు విద్యాబుద్ధులు చెప్పి మంచిగా తీర్చిదిద్దుతారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఉపాధ్యాయ వృత్తి తీసుకునే వారి సంఖ్య తగ్గిపోతోందని తెలిపారు. భవిష్యత్ తరాలను తయారుచేసే శక్తి ఒక్క ఉపాధ్యాయుడికే ఉంటుందన్నారు. విద్యార్థులు వారి విద్యాభ్యాసం తర్వాత ఉపాధ్యాయ వృత్తిని తీసుకోవాలని ఒంటేరు సూచించారు. కరస్పాండెంట్ అరకట వేముల హరి నారాయణ మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం కళాశాల ప్రతి సంవత్సరం అప్డేట్ అవుతూనే ఉందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల కో-ఆర్డినేటర్ పర్లపాడు గౌరీశంకర్, ప్రిన్సిపల్ ముస్తఫా, రామ్మోహన్, అజ్రా, రెడ్డమ్మ మౌనయ్య, సలీం, పృథ్వీ నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : స్థానిక గీతాశ్రమంలో శనివారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం, సంస్కృతి స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైవియు ఉపకులపతి కృష్ణారెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ఎంఇఒ సావిత్రమ్మ, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

దొంగతనాల కట్టడిపై అవగాహన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

గత మూడు నెలలుగా పట్టణంలో జరుగు తున్న దొంగతనాలు అటు ప్రజలకు, ఇటు పోలీసులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. దొంగలు ఎటువైపు నుంచి దోచుకుంటారోనని భయాందోళనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో పులివెందుల పోలీసులు దొంగతనాలు జరిగే విషయాలపై ప్రజలకు కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ఆ మేరకు శనివారం అర్బన్ సీఐ జీవన్ గంగానాథ్ బాబు, ఎస్ఐ నారాయణ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ దొంగతనాలు, మోసాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలీసుల ఆధ్వర్యంలో ఈ కరపత్రాలను ముద్రించి పంపిణీ చేస్తున్నామన్నారు.

నేత్రదానంతో పలువురికి చూపు

- మేజిస్ట్రేట్ ముదివేటి చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



జ్ఞాపికను అందజేస్తున్న మెజిస్ట్రేట్ చంద్రశేఖర్‌రెడ్డి

అంధులకు చూపు ఇచ్చే నేత్రదాన కార్యక్రమం మహా పుణ్యకార్యమని పులివెందుల జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ముదివేటి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణానికి చెందిన లాయర్ కరుణాకర్‌రెడ్డి చెల్లెలు గోకనపల్లి తులసీదేవి ఈ మధ్య కాలంలో మరణించడంతో స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం ఆధ్వర్యంలో ఆమె కళ్లను దానం చేశారు. ఈ సందర్భంగా శనివారం మెజిస్ట్రేట్ ఛాంబర్‌లో లాయర్ కరుణాకర్‌రెడ్డికి ఆయన చేతులమీదుగా జ్ఞాపిక అందజేసి, ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో స్నేహిత అమత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, న్యాయవాదులు పాల్గొన్నారు.

శ్రీవారి నిర్మల్ లిక్విడ్ షాపు ప్రారంభం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం



షాప్ వద్ద ఏర్పాటు చేసిన దసరా ఆఫర్

స్థానిక మల్లెపల్లి రోడ్డు మీసేవా కేంద్రం ఎదురుగా శ్రీవారి నిర్మల్ లిక్విడ్ షాపును శనివారం ప్రారంభించినట్లు ప్రొప్రయిటర్ డి.రమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఇంటిలో నిత్యం ఉపయోగించే అగర్‌బత్తిలు, యాసిడ్, బాత్‌రూమ్ క్లినిగ్ లిక్విడ్, వాషింగ్ మిసెన్ లిక్విడ్, రాగి వస్తువుల క్లినింగ్ లిక్విడ్, ఫ్లోర్ క్లినింగ్ లిక్విడ్ తదితర వాటిని అతి తక్కువ ధరతో ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ఈ అవకాశాన్ని మఠం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

క్రైం కార్నర్

వివాహేతర సంబంధంతోనే వీఆర్ఎ హత్య

- డిఎస్‌పి మురళినాయక్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



మాట్లాడుతున్న డిఎస్‌పి మురళినాయక్

వేముల మండలం కొత్తపల్లి గ్రామంలో గత నెల 29న విఆర్ఎ నరసింహులు హత్య కేసులో బాబు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి మురళి నాయక్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ కొత్తపల్లె గ్రామానికి చెందిన విఆర్ఎ నరసింహులు, సుబ్బలక్ష్మమ్మ దంపతులు ఇంటి ఆవరణలోని రేకులషెడ్డులో నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి మంచం కింద బ్లాస్టింగ్ మెటీరియల్ ఉపయోగించి పేల్చడంతో నరసింహులు మృతి చెందాడని తెలిపారు. సుబ్బలక్ష్మమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌పి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఆర్కే వ్యాలీ సీఐ నాగరాజు, వేముల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కేసు దర్యాప్తు చేశారన్నారు. వేముల మండలం పాత కదిరి రోడ్డులో వాహనాలు తనిఖీలు చేస్తుండగా బాబు అనే వ్యక్తిని అరెస్టు చేసి విచారించినట్లు డిఎస్‌పి తెలి పారు. ఈ విచారణలో బాబు ముగ్గురాయి గనులలో కూలికి వెళ్లే సమయంలో నర సింహులు భార్యతో వివాహేతర సంబంధం ఏర్పడిందన్నారు. ఈ విషయం తెలుసుకున్న నరసింహులు అతని కుటుంబ సభ్యులు బాబును మందలించారు. నరసింహులుపై పగ పెంచుకున్న బాబు వారు నిద్రపోతున్న సమయంలో మంచం కింద జిలెటన్‌స్టిక్స్ పేల్చారన్నారు. సమావేశంలో ఆర్కేవ్యాలీ సిఐ నాగరాజు, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, ఎఎస్ఐ చంద్రశేఖర్ స్వామి, పోలీసులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి రైల్వే ఉద్యోగికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - ముద్దనూరు

కడప-తాడిపత్రి ప్రధాన రహదారి యామవరం గ్రామ సమీపం వద్ద బైకు నుంచి కిందపడి రైల్వే ఉద్యోగి నాగేశ్వరరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ముద్దనూరు 108 సిబ్బంది మహేష్, పైలెట్ సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపురం మండలం లావనూరు గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రెడ్డి రైల్వేలో విధులు నిర్వహిస్తున్నారు. సొంత పని నిమిత్తం ముద్దనూరుకు వచ్చి, స్వగ్రామమానికి వెళ్తుండగా గాలేరు-నగరి కాల్వ వద్ద బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో నాగేశ్వరెడ్డి ఎడమ కాలు, ఎడమ చేయి విరిగింది. ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించినట్లు చెప్పారు.

శనగ రాయితీలో కుదింపు

ఈ ఏడాది 25 శాతానికి పరిమితం - పెదవి విరుస్తున్న రైతులు



సాగుకు సిద్ధంగా ఉన్న భూమి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

రబీ సీజన్‌లో సాగు చేసే బుడ్డ శనగలకు ప్రతి ఏడాది రాష్ట్ర ప్రభుత్వం రాయితీనిస్తోంది. గతంలో 50 శాతం రాయితీతో శనగలను రైతులకు పంపిణీ చేసేవారు. గతేడాది 50 శాతం ఉన్న రాయితీని 40 శాతానికి పరిమితం చేశారు. ఈ ఏడాది మాత్రం 40 శాతం ఉన్న రాయితీని 25 శాతానికి కుదించడం పట్ల రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయట మార్కెట్‌కు ప్రభుత్వం రాయితీ అనంతరం రైతు వాటాకు ఇస్తున్న ధరకు పెద్దగా వ్యత్యాసం లేదని రైతులు చెబుతున్నారు.

మండలంలో విస్తారంగా సాగు..

ప్రతి ఏడాది రబీ సీజన్‌లో మండలంలో విస్తారంగా బుడ్డ శనగను సాగు చేస్తున్నారు. వై.కొత్తపల్లి, కసనూరు, ముసల్‌రెడ్డిపల్లె, సుంకేసుల, సింహాద్రిపురం, గురుజాల, అంకాలమ్మ గూడూరు తదితర గ్రామాల్లో దాదాపుగా 15 వేల ఎకరాల్లో సాగుకు భూములను దుక్కిదున్ని, ఎరువులు వేసి రైతులు సిద్ధంగా ఉంచారు. గడిచిన రెండు రోజుల నుంచి కొన్ని గ్రామాల్లో వర్షాలు కురవడం.. భూములు విత్తనానికి అనుకూలం కావడంతో రాయతీ విత్తనాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

ఎకరాకు 40 కిలోల పంపిణీకి ఆదేశాలు..

సాగు చేసే ప్రతి రైతుకు ఎకరాకు 40కిలోల చొప్పున బుడ్డ శనగల పంపిణీకి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. శనగల కిలో పూర్తి ధర రూ.94 కాగా, ప్రభుత్వ రాయితీ 25 శాతం రూ.23.50 పోనూ మిగిలిన 75 శాతం రాయితీకి రూ.70.50 రైతులు చెల్లించాల్సి ఉంది. గతంతో పోలిస్తే ఈ ఏడాది ఎకరాకు 40 కిలోల ప్రకారం పంపిణీ చేయనున్నారు. గతంలో కేవలం ఎకరాకు 25 కిలోలు మాత్రమే ఇస్తూ ఉండేవారు. ఈ విధానం రైతులకు కొంతమేర ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

రాయితీ తగ్గించడం అన్యాయం..



ప్రభుత్వం బుడ్డ శనగల రాయితీ తగ్గించడం అన్యాయం. ఈ విధానం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకొని 50 శాతం రాయితీతో విత్తనాలను పంపిణీ చేయాలి.

- వెన్నపూస అరవింద నాథరెడ్డి,
రాష్ట్ర రైతుల సంఘం నాయకులు, సింహాద్రిపురం

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె



తూపల్లెలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న తులసిరెడ్డి

పులివెందుల నియోజకవర్గం వ్యాప్తంగా ప్రకృతి వైపరీత్యంతో నష్టపోయిన రైతులను, పిడుగు పాటుకు మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని పిసిసి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అలిరెడ్డిపల్లె, తూపల్లె, కుమ్మరాంపల్లె, ఇడుపులపాయ గ్రామాల్లో గాలి, వానతో నేలకొరిగిన వరి పంటలను శనివారం తులసిరెడ్డి కాంగ్రెస్ నేతలతో కలిసి పరిశీలించారు. వరి పంటను సాగు చేసిన ఆయా గ్రామాల రైతులు నాగభూషన్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, విజయకుమార్, రామకృష్ణారెడ్డి, సురేష కుమార్‌రెడ్డి, రమణతో నష్టంపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ రెండు రోజుల క్రితం నియోజకవర్గ వ్యాప్తంగా తీవ్రంగా వీచిన గాలులు, వర్షాలు, పిడుగుపాటుకు తీవ్రనష్టం జరిగిందని పేర్కొన్నారు. వంద ఎకరాల్లో వరి పంట నేలకు వాలిందని వివరించారు. ఒక్కో ఎకరా మీద దాదాపు రూ.40 వేలు ఖర్చు చేశారని తెలిపారు. వరి పంటను సాగు చేసిన వారిలో రైతులు, కౌలు రైతులు కూడా ఉన్నారని పేర్కొన్నారు. ఈ నెలాఖరుకు పంట చేతికి వచ్చేదని, అలాంటి పరిస్థితిలో పంట నూరు శాతం చేతికి రాకుండా పోవడంతో రైతులు, కౌలు రైతులకు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సింహాద్రిపురం మండలం గురజాల, చెర్లోపల్లి, బిదినంచెర్ల గ్రామాల్లో అరటి పంట పూర్తిగా దెబ్బతిందని చెప్పారు. పిడుగుపడి పెండ్లిమర్రి మండలంలో శివపార్వతి, రాజేశ్వర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి అనే రైతులు, పశువుల కాపరులు మృతి చెందారని, మరో వ్యక్తి నరేష్‌కుమార్ రెడ్డికి తీవ్ర గాయాలైనట్లు చెప్పారు. పిడుగు పాటుకు మృతి చెందిన వారి కుటుంబాలకు పరిహారమిచ్చి ఆదుకోవాలని కోరారు. సింహాద్రిపురం మండలం బి.చెర్లోపల్లి గ్రామంలో సతీష్ కుమార్‌రెడ్డికి చెందిన కోడె, దూడ పిడుగుపాటుకు చనిపోయాయని తెలిపారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం అరవీడులో లక్ష్మీదేవికి చెందిన పాడి ఆవు పిడుగు పాటుకు మృతి చెందిందన్నారు. అనంతరం వరి పంట నష్టంపై జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వర్‌రావు, వేంపల్లి ఎఒ రాజేంద్రప్రసాద్‌తో తులసిరెడ్డి ఫోన్ ద్వారా చర్చించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పులివెందుల ఇన్‌ఛార్జి ధృవకుమార్‌రెడ్డి, ఉత్తన్న, వినయ్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా : పిఆర్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగ నియోజకవర్గంలోని వైసిపి కార్యకర్తలెవరు కూడా అధైర్యపడవద్దు.. అండగా ఉంటానని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి భరోసా ఇచ్చారు. స్థానిక బయపురెడ్డి మిల్లు సమీపంలో శనివారం ఆయన వైసిపి కార్యాలయాన్ని ప్రారంభించారు. ముందుగా పార్టీ జెండాను ఎగరేశారు. అక్కడి నుంచి ర్యాలీగా నారాపురస్వామి దేవాలయ సమీపంలోని వైఎస్ఆర్ విగ్రహం వద్దకు చేరుకొని పూలమాల వేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల వచ్చినప్పుడు నియోజకవర్గంలోని కార్యకర్తలు జరిగిన సంఘటనలను దాడులను వివరించారన్నారు. అక్కడే ఉన్న తనను చూసి అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఆక్టివ్‌గా ఉండాలని పిలుపునిచ్చారన్నారు. ఆ పిలుపుమేరకే ఈ నూతన కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్క కార్యకర్తకు, నాయకుడికి అండగా ఉంటానన్నారు. రాజకీయాలు పొన్నపురెడ్డి కుటుంబానికి కొత్త కాదన్నారు. నాయకుడిని కార్యకర్తలు నమ్మితే ఎలా ఉంటారో మా కుటుంబానికి తెలుసన్నారు. గతంలో తాను రెండేళ్లు జైల్లో ఉన్నప్పుడు తన కుటుంబాన్ని ముందుకు నడిపించింది కార్యకర్తలేనని పిఆర్ గుర్తు చేశారు. అదే నమ్మకంతో ఉండాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజా సమస్యలు, రైతు సమస్యలపై ప్రతిపక్షంగా అండగా ఉండి పోరాడుదాం అని కార్యకర్తలకు సూచించారు. ఎస్‌పి, నియోజకవర్గ పోలీసులు జమ్మలమడుగు ప్రశాంతంగా ఉండేందుకు కృషి చేయాలని కోరారు. ఫ్యాక్షన్ వల్ల కుటుంబాలకు నష్టం తప్ప లాభం లేదన్నారు. పిలిచిన వెంటనే వచ్చిన కార్య కర్తలందరికీ ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కార్యక్ర మంలో పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, పొన్నపురెడ్డి వెంకటశివారెడ్డి, మలికిరెడ్డి హను మంత్‌రెడ్డి, వల్లంబాయి హృషి కేశవరెడ్డి, ఉప్పలపాడు శ్రీనివాసులురెడ్డి, ముల్లా జానీ, వద్దిరాల ఆంజనేయులు, వైసిపి అధికార ప్రతినిధి ఉప్పలపాటి యోబు, గూడెంచెర్వు నాగేశ్వరరెడ్డి, గోరిగనూరు భాస్కర్‌రెడ్డి, వెంకటరమణా రెడ్డి, చిన్నకొమెర్ల మోహన్‌రెడ్డి, జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాల నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.

అభాగ్యులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక బస్టాండ్, గుడి వద్ద, రోడ్ల మీద ఉన్న అభాగ్యులకు శుక్రవారం అర్ధరాత్రి వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వర్షం వల్ల రోడ్లపై చలిగా ఉంటుందని, దాతల సహకారంతో దుప్పట్లు పంపి ణీ చేశామన్నారు. అనాథలకు తమ వివేకా నంద సేవాశ్రమంలో ఉచితంగానే ఆశ్రయం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. సంస్థ ప్రతినిధులు పాతకోట శ్రీనివాసరెడ్డి, టి.వెంకట సురేష్, కేతన శ్రీనాథ్ పాల్గొన్నారు.

8న చాపాడు మండల సమావేశం

ప్రజాశక్తి-చాపాడు

చాపాడు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 8న నిర్వహిస్తున్నట్లు ఎంపిపి టి.లక్షుమయ్య తెలిపారు. సమా వేశానికి మండల అధికారులు మూడు నెలల పూర్తి నివేదికతో హాజరు కావాలని ఆయన సూచించారు. ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి సమావేశంలో అధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు మాత్రమే హాజరుకావాలని కోరారు. వారిపేరుతో ఇతరులు వస్తే అనుమతించేది లేదని ఎంపిపి వివరించారు.

అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-చక్రాయిపేట

మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వారిపై కఠించాలని తీసుకుంటామని ఎస్ఐ రంగారావు హెచ్చ రించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన మహిళా పోలీసులతో మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల పట్ల గ్రామాల్లో అస భ్యకరంగా ప్రవర్తించే వారిపై దృష్టి సారించి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. ముఖ్యంగా గ్రా మాల్లో రచ్చబండలపైన యువకులు కూర్చొని మహిళలను ర్యాగింగ్ చేసినట్లయితే చర్యలు తీసుకుంటామన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ రంగారావు

పారదర్శకంగా టెండర్ల ప్రక్రియ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మద్యం షాపులకు సంబంధించి పారదర్శకంగా టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్‌శాఖ సిఐ చెన్నారెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 1న మద్యం షాపులకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైందన్నారు. పులివెందుల ప్రాంత పలు మండలాలకు 16 షాపులు మం జూరయ్యాయని తెలి పారు. ఇందులో పులి వెందులకు ఏడు, వేంపల్లి ఐదు, వేములకు ఒకటి, చక్రాయపేటకు ఒకటి, లింగాలకు రెండు షాపులు మంజూర య్యాయన్నారు. 50 వేల కంటే జనాభా అధికంగా ఉన్న పులివెందుల, వేంపల్లికు రూ.65 లక్షలు లైసెన్స్ ఫీజు ఉంటుందన్నారు. మిగిలిన మండలాలకు రూ.55 లక్షలు ఉంటుందన్నారు. అప్లికేషన్ ఫీజు రూ.2 లక్షలు ఇఎండి లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 11న లాటరీ పద్ధతిలో జిల్లా పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో టెండర్లు డ్రా తీస్తారన్నారు. ఆసక్తి గలవారు ఆన్‌లైన్‌లో మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బయట వస్తున్న అపోహాలను ఎవరూ నమ్మవద్దని ఆయన సూచించారు.

ముద్దనూరు : ముద్దనూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముద్దనూరు, కొండాపురం, సింహాద్రిపురం, తొండూరు మండలాల్లో మద్యం దుకాణాల నిర్వహణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ విన్నీలత తెలిపారు. ముద్దనూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాలుగు మండలాలకు సంబంధించి 7 షాపులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ముద్దనూరులో-2, కొం డాపురం-2, సింహాద్రిపురం-2, తొండూరు మండలంలో ఒకటి చొప్పున ప్రభుత్వం మద్యం దుకా ణాలు ఏర్పాటు చేయ నున్నట్లు చెప్పారు.

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా

- ఆర్‌డిఒ భానుశ్రీ అన్నపూర్ణ ప్రత్యూష

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



చట్ట పరిధిలోని న్యాయపరమైన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని పులివెందుల నూతన ఆర్‌డిఒ గణేష్ల భానుశ్రీ అన్నపూర్ణ ప్రత్యూష పేర్కొన్నారు. బదిలీలో భాగంగా శనివారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆర్‌డిఒ మాట్లాడుతూ పులివెందుల తాలూకా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. అంతకు ముందు ఆర్‌డిఒకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. కార్యక్రమంలో పులివెందుల తహశీల్దార్ నజీర్‌బాషా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎంఎ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు




కోశాధికారి వరుణ్‌కుమార్ రెడ్డి

ప్రొద్దుటూరు ఐఎంఎ భవనంలో శనివారం ఐఎంఎ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా డాక్టర్ త్యాగరాజురెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ సాయిప్రసాద్, కోశాధికారిగా డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐఎంఎ అభివృద్ధికి వైద్యుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. సభ్యుల సహకారంతో ముందుకు వెళతామన్నారు. పట్టణ ప్రజలకు పలు రకాల వైద్య సేవలు అందిస్తామన్నారు.

మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

- బాధ్యతలు చేపట్టిన ఎంపిడిఒ బి.రాజశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - చక్రాయపేట



మండలాన్ని అందరి సహకారంతో అన్ని విధాలా అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపిడిఒ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మండలంలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్యం తదితర వాటిపై ప్రత్యేకదృష్టి పెడతామన్నారు.



ఎపిఐఐసి చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

చైర్మన్లకు ఎమ్మెల్సీ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మంతెన రామరాజుని మంగళగిరిలోని ఎపిఐఐసి కార్యాలయంలో శనివారం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కలిసి శుభా కాంక్షలు తెలిపారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా డాక్టర్ నూకసాని బాలాజి పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొని శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందులను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పక్కాగృహాలు త్వరితగతిన పూర్తి చేయాలి

ముద్దనూరు : పెండింగులో ఉన్న పక్కాగృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఒ ముకుందరెడ్డి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఆయన గృహ నిర్మాణాలపై ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా వివిధ దశల నిర్మాణాల్లో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సిమెంటు, కడ్డీలు, ఇసుక కొరత లేకుండా చూడాలన్నారు. ఇల్లు నిర్మించుకునే ప్రతి లబ్ధిదారుడికి దశల వారీగా బిల్లులు మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. నిర్దేశించిన లక్ష్యానికి ఇళ్లు పూర్తి చేయాలని ఎంపిడిఒ ఆదేశింఆచరు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఇ రవికుమార్, పరిపాలన అధికారి అరుంధతి పాల్గొన్నారు.

విద్యాశాఖాధికారుల తీరు సరైందికాదు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

జిల్లాలో కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలు సెలవు దినాల్లో బయట గేటుకు తాళాలు వేసి లోపల తరగతులు నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం సరైంది కాదని ఎఐఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు జగదీష్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు తెలిపారు. స్థానికంగా శనివారం వారు మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు మామూళ్ల మత్తులో మునిగిపోయి చోద్యం చూడడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదేశాలు జారీ చేసినప్పటికీ జిల్లాలో ఉన్న ఆర్‌ఐఒ ఆదేశాలను ఏ ఒక్క విద్యాసంస్థలకు పంపించకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని ఆరోపించారు. సెలవు దినాలలో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని కోరారు.